ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబర్ 2025 5 అనంతపురం





ఏసీఏ అండర్-19 క్రికెట్ టోర్నీ మొదటి మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

# సమాన హక్కుల కోసం ఐక్య పోరాటాలు

◆ మహిళలపై వేధింపుల నిర్మూలన ప్రభుత్వం బాధ్యత ◆ మైక్రోఫైనాన్స్ దోపిడీ, మద్యం, డ్రగ్స్‌ను నియంత్రించాలి ◆ ఐద్వా అఖిల భారత నాయకురాలు పుణ్యవతి

## ◆ అనంతలో ఘనంగా ఐద్వా 7వ జిల్లా మహాసభలు



ఐద్వా మహాసభల జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమాజంలో సగభాగంగా ఉన్న మహిళలకు విద్యా, ఉద్యోగం, రాజకీయం తదితర అన్ని రంగాల్లో సమాన హక్కులు సాధన కోసం ఐద్వా ఆధ్వర్యంలో ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జాతీయ నాయకురాలు పుణ్యవతి పిలుపునిచ్చారు. ఐద్వా అనంతపురం 7వ జిల్లా మహాసభలు అనంతపురం నగరంలోని లలిత కళాపరిషత్ హాలులో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల అధ్యక్షతన నిర్వహించిన మహాసభలకు ఐద్వా జాతీయ నాయకురాలు పుణ్యవతి, రాష్ట్ర కోశాధికారి సావిత్రి, జెవివి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ప్రసూన, డాక్టర్ హేమలత ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత అరుణనగర్‌లో మహాసభ సందర్భంగా ఐద్వా జెండాను అతిథులు ఆవిష్కరించారు. సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టి, మృతులకు నివాళులు అర్పించారు. అనంతరం నిర్వహించిన మహాసభలో ఐద్వా జాతీయ నాయకురాలు పుణ్యవతి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై రోజురోజుకు హింస పెరిగిపోతోందన్నారు. హింస రూపం దశమార్చుకుంటూ మహిళా సమాజాన్ని పట్టి పీడిస్తోందన్నారు. దేశంలో



మహాసభలకు హాజరైన ప్రతినిధులు

మైక్రో ఫైనాన్స్ దోపిడీ దౌర్జన్యాలు పెరిగి అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. ఐద్వా దేశంలో మహిళలపై చేసిన సర్వేలో సమాజం తలదించుకునే దయనీయ సంఘటనలు దారుణాలు జరుగుతున్నాయని తెలిపారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులు ఇళ్ల వద్దకు వచ్చి నానా ఇబ్బందులకు గురి చేయడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు స్పందించి మైక్రో ఫైనాన్స్ సంస్థలను నియంత్రించాలన్నారు. ఇబ్బందులకు గురి చేస్తున్న ఫైనాన్స్ సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వమే బ్యాంకుల ద్వారా పావలా వడ్డీతో మహిళలకు డ్వాక్రా ద్వారా రుణాలు అందించాలన్నారు. మైక్రోఫైనాన్స్ వడ్డీ రూపాయి లోపు సీలింగ్ పెట్టి అమలు చేయాలన్నారు. జిల్లాలో మహిళా సమస్యలపై ఐద్వా బలంగా పోరాటాలు చేస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో పోరాటాలను మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జెవివి రాష్ట్ర నాయకురాలు డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ నేటికీ భ్రూణ హత్యలు కొనసాగుతుండటం దారుణంగా ఉందన్నారు. మహిళలు అనేక రూపాల్లో హింస, అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బిడ్డల కోసం సరోగసి తదితర విధానాలతో వైద్య రంగంలో నూతన దోపిడీ పెరిగిపోతుందన్నారు. విద్యా, వైద్యం హక్కుగా అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సమస్యలపై పోరాటాలు కొనసాగించిందన్నారు. మహిళలకు అండగా నిలిచి ప్రభుత్వాలను కదిలించేలా కృషి చేశామన్నారు. అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో అనంతపురం నగరంలో నిర్వహించే ఐద్వా రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, జిల్లా కోశాధికారి చంద్రిక, జిల్లా నాయకురాలు జ్యోతి, నగర అధ్యక్ష కార్యదర్శులు శంషాద్, అశ్విని, జిల్లా కమిటీ నాయకులు రామాంజినమ్మ, శైలజ, గీత తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న పుణ్యవతి

### ఐద్వా జిల్లా నూతన కమిటీ ఎన్నిక

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) అనంతపురం జిల్లా నూతన కమిటిని మహాసభల్లో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా శ్యామల, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రిక, జిల్లా కోశాధికారిగా అశ్విని, కార్యదర్శివర్గం సభ్యులుగా గీత, శైలజా, శంషాద్, జ్యోతి, రంగమ్మ, రాజీ, క్రిష్ణమ్మ, నాగమ్మ, సాలమ్మ, లక్ష్మిదేవి, లక్ష్మితో పాటు 26 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.



ఐద్వా నూతన కోశాధికారి, అధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి అశ్విని, శ్యామల, చంద్రిక

## జాతీయస్థాయికి ఎదగాలి

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

అనంత క్రీడాగ్రామంలో ఏసీఏ అండర్-19 క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా నుంచి ప్రతినిథ్యం వహిస్తున్న వారు అత్యుత్తమ ప్రదర్శన చేసి భారతదేశ జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆర్డీటీ క్రీడా మైదానంలో ఏసీఏ అండర్-19 క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ప్రారంభం అయ్యింది. మొదటి మ్యాచ్ ఆంధ్ర ప్రెసిడెంట్, బరోడా జట్ల మధ్య మొదలైంది. కలెక్టర్ క్రికెట్ టీం క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం కలెక్టర్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. అన్ని క్రీడలకు అనంతపూర్ ఆర్‌డిటి చాలా ప్రోత్సాహం ఇస్తోందన్నారు. టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ పాటవాలు ప్రదర్శించి అత్యుత్తమ స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా క్రికెటర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి, కార్యదర్శి భీమ లింగారెడ్డి, ఎసిఎ, జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ అచ్యుతారావు, సెలెక్టర్ లీలా మోహన్ రెడ్డి, ట్రెజరర్ షబ్బీర్ అహ్మద్, మాజీ రంజీ ప్లేయర్ సురేష్, మాజీ కార్యదర్శులు రామలింగారెడ్డి, డిఆర్ ప్రసన్న ఎడిసిఎ నెంబర్ టీవీ చంద్రమోహన్ రెడ్డి, విజయ్ కుమార్, మొహమ్మద్ రఫీ, సర్దార్ డిసిసిఐ లెవెల్ టు కోచ్ శ్రీనివాస్ రెడ్డి సీనియర్ క్రీడాకారులు కమలాకర్ నాయుడు, కోచ్‌లు ఆర్.కుమార్, నరేష్ ఆర్.ప్రవీణ్, ఇనాయకుల్లా పాల్గొన్నారు.

## జెఎన్‌టియు ఎంటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఆగస్టు నెలలో నిర్వహించిన ఎం.టెక్ ఒకటవ, రెండవ సెమిస్టర్ (ఆర్ 21) రెగ్యులర్ ఫలితాలను బుధవారం విడుదల చేశామని ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి తెలిపారు. పరీక్ష ఫలితాల కోసం కళాశాల అకడిమిక్ విభాగంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, డిప్యూటీ కంట్రోలర్స్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కె.మాధవి, డా॥డి.లలిత కుమారి, డా॥జరీన, భువన విజయ, కెఎఫ్.భారతి, టి.నారాయణ రెడ్డి, కళ్యాణ్ కుమా, చంద్రమోహన్ రెడ్డి, కళ్యాణి రాధ, అజిత పాల్గొన్నారు.

## జెఎన్‌టియు విసిని కలిసిన బీటెక్ రవి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురము జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శన రావును మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పులివెందుల జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో నెలకొన్న సమస్యలను ఉపకులపతి దృష్టికి తీసుకొచ్చారు. పులివెందుల జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజ్‌లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, చేపట్టాల్సిన అభివద్ధి పనులపై చర్చించారు. రాబోయే కాలంలో విశ్వవిద్యాలయం సర్వతోముఖాభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు పూర్తిగా ఉంటాయని బీటిఎక్ రవి హామీ ఇచ్చారు.



విసితో మాట్లాడుతున్న బీటెక్ రవి

## దుర్భాషలాడిన 'గుమ్మనూరు' క్షమాపణ చెప్పాలి

2013 భూ సేకరణ చట్టం అమలు చేయాల్సిందే - రైతు, వ్యవసాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకుల డిమాండ్



విలేకరులతో మాట్లాడుతున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సోలార్ ప్రాజెక్ట్ భూసేకరణ నేపథ్యంలో పరిశీలనకు వెళ్లిన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిపై తీవ్ర దుర్భాషలతో దూషించిన గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బేషరతుగా క్షమాపణలు చెప్పాలని వామపక్ష పార్టీలు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఎపి రైతు సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైతు సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఆర్.చంద్రశేఖరరెడ్డి, సి.మల్లికార్జున, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎం.క్రిష్ణమూర్తి మాట్లాడుతూ గుత్తి, పామిడి మండలాల్లో ఏర్పాటు చేయబోతున్న సోలార్ ప్రాజెక్ట్ సంబంధించి జరుగుతున్న భూసేకరణ పరిశీలించేందుకు వెళ్లిన ఎపి రైతు సంఘం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిపై గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం నోరు పారేసుకోవడం దుర్మార్గంగా ఉందన్నారు. అరగంటలో ఇక్కడి నుంచి ఖాళీ చేయకపోతే అక్కడికి వచ్చి తరిమి కొడతామని బెదిరించే విధంగా ఫోన్లో మాట్లాడటం ప్రజాప్రతినిధి దిగజారుడు చర్యలకు నిదర్శనం అన్నారు. ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియాలో ప్రసారం చేయలేని పదజాలంతో బూతు పురాణంతో బెదిరించారని తెలిపారు. గుత్తిలో మీడియా సమావేశం ఏర్పాటు చేస్తే అక్కడికి ఆ పార్టీ నాయకులు కొంతమంది వచ్చి బెదిరించే విధంగా మాట్లాడటం జరిగిందన్నారు. బేతాపల్లిలో సోలార్ ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున భూములను సేకరిస్తున్నారని తెలిపారు. ఉపాధి కల్పన పేరుతో కంపెనీ యజమానులతో కుమ్మక్కై కోట్లాది రూపాయలు అక్రమ సంపాదనకు ఎమ్మెల్యే అనుచరులు తెరలేపారన్నారు. రైతులను మభ్యపెట్టి వారి అంగీకారం లేకున్నా బెదిరింపులకు దిగి కంపెనీకి భూములు ఇచ్చేందుకు చేస్తున్నారని తెలిపారు. దీనిని పరిశీలించేందుకు వెళ్లిన రైతుసంఘం నాయకులపై ఎమ్మెల్యే దూషించడం సిగ్గుచేటన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలన్నారు. బలవంతంగా భూసేకరణ చేయరాదన్నారు. ప్రస్తుత భూమి లీజు విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటి కోసం రైతుల పక్షాన తమ పోరాటం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పండ్ల తోటలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వి.శివారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.నాగమణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ పాల్గొన్నారు.

## హామీలన్నీ అమలు చేస్తున్నాం..

గుర్తుండిపోయేలా 'సూపర్ సిక్స్-సూపర్‌హిట్' విజయోత్సవ సభ - ముఖ్యమంత్రి పర్యటన బహిరంగ సభ ఏర్పాట్లు ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తోందని టిడిపి ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీన అనంతపురం జిఎంఆర్ మైదానంలో జరగనున్న 'సూపర్ సిక్స్, సూపర్‌హిట్' విజయోత్సవం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను టిడిపి నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ, టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరాం, అహుడా ఛైర్మన్ టిసి.వరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశామన్నారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అని ప్రజలంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో గుర్తుండిపోయేలా ఈ బహిరంగసభను అనంతలో నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపు 3.50 లక్షల మందితో సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు 164మంది ఎమ్మెల్యేలూ ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. బహిరంగ సభలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



సభ ఏర్పాట్లను పూజా కార్యక్రమంతో ప్రారంభిస్తున్న కూటమి నాయకులు

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనంతపురం జిల్లా పర్యటన నేపథ్యంలో నగరంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న జిఎంఆర్ గ్రౌండ్స్, ఇంద్రప్రస్థ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ముఖ్యమంత్రి ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజుతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం సాయంత్రం పరిశీలించారు. హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్, తదితర ఏర్పాట్లకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, పలు సూచనలు జారీచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ పి.జగదీష్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, గుంటూరు మేయర్ కోవెలమూడి నాని, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణను సన్మానిస్తున్న డిపిఆర్‌ఒ కార్యలయం సిబ్బంది

## డిపిఆర్‌ఒ వెంకటరమణ సేవలు ఎనలేనివి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా సమాచార పౌర సంబం ధాల శాఖలో డిపిఆర్‌ఒ పి.వెంకటరమణ అం దించిన సేవలు ఎనలేనివని డిఐపిఆర్‌ఒ బాలకొండయ్య కొనియాడారు. వెంకటరమణ ఉద్యోగోన్నతి బదిలీపై అసిస్టెం ట్ డైరెక్టర్‌గా బాపట్ల జిల్లాకు వెళ్తున్నారు. దీంతో బుధవారం నగరంలోని డిపిఆర్‌ఒ కార్యాలయంలో ఆత్మీ య సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డిఐపి ఆర్‌ఒ బాలకొండయ్య మాట్లాడుతూ వెంకటరమణ సమాచార పౌర సంబంధాల శాఖలో వివిధ హోదాల్లో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా నుంచి ఇక్కడికి వచ్చి, ఇప్పుడు బాపట్ల అసిస్టెంట్ డైరెక్టర్‌గా వెళ్తున్నారన్నారు. అనంతరం వెంకటరమణను పూల మాలలు, శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో పిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి, ఎపిఆర్‌ఒ ఫక్రుద్దీన్, ప్రభావతి, దామోదర్‌రెడ్డి, కమల్, ఆంజనేయులు, భాస్కర్, కాశీం పాల్గొన్నారు.

## మధ్యంతర భృతిని ప్రకటించాలి

**అనంతపురం కలెక్టరేట్ :** ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ బుక్కరాయసముద్రం మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిరాజుద్దీన్ మాట్లాడుతూ మధ్యంతర భృతి, పెండింగ్ డీఏలను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్ వలి, తిప్పేస్వామి, శ్రీనివాసులు, బాలముద్దన్న, కృష్ణమూర్తి, రామాంజనేయులు, రంగా నాయుడు పాల్గొన్నారు.

## పోలా రామాంజినేయులు ఆశయాలను కొనసాగిస్తాం

వర్థంతి కార్యక్రమంలో నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

చేనేత కార్మికులు, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించిన పోలా రామాంజినేయులు ఆశయాలను కొనసాగించేలా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కామ్రేడ్ పోలా రామాంజనేయులు రెండవ వర్థంతి కార్యక్రమాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్లో బుధవారం నిర్వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్.బాషా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలా రామాంజనేయులు చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం సాగించారన్నారు. కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా కృషి చేశారన్నారు. చేనేత పట్టు పరిశ్రమను కాపాడేందుకు అనేక రకాల ఉద్యమాలను నిర్వహించారని గుర్తు చేశారు. 11 రకాల చేనేత రిజర్వేషన్ చట్టాన్ని అమలు చేయాలని, ప్రతి కార్మికునికి సబ్సిడీ అందించాలని, ప్రత్యేక బ్యాంకును ఏర్పాటు చేయాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని, ప్రభుత్వం నుంచి ప్రతి సంవత్సరం రూ.24 వేల ఆర్థికసాక సాయం అందించాలని కోరుతూ ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్ రెడ్డిని ప్రత్యక్షంగా కలిసి కార్మికులకు సహాయ సహకారాలు అందించాలని కోరారన్నారు. పోల రామాంజనేయులు ఆశయాల సాధన కోసం ఆయన పోరాటాలకు పునరంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, సిఐటియు నాయకులు జెవి.రమణ, టి.అయూబ్ ఖాన్, ఎల్..ఆదినారాయణ, ఎస్.హైదర్ వలీ, జెవివి జిల్లా కార్యదర్శి లోకేష్, ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు గుంపు హరి, ఎ.ఖాదర్ బాషా, వి.వెంకటస్వామి, అన్నం సూరి, పులిచెర్ల హరి, చౌడయ్య, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎం.బాబు, ముకుంద, ఓబులేసు, వెంకటరాముడు, ఎల్.ఆదినారాయణ, పాల్గొన్నారు.



పోలా రామాంజినేయులుకు నివాళి అర్పిస్తున్న సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు

## అంగన్‌వాడీ కేంద్రాలతో మెరుగైన సేవలు

ఐసిడిఎస్ పీడీ నాగమణి



సిబ్బందితో మాట్లాడుతున్న పిడి నాగమణి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అంగన్‌వాడీ కేంద్రాలతో లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని, ఇందుకోసం అందరూ కష్టపడి పని చేయాలని ఐసిడిఎస్ పిడి నాగమణి సూచించారు. ఆమె బుధవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టును సందర్శించారు. సిడిపి లక్ష్మిప్రసన్న, సూపర్‌వైజర్లు రాధ, కాశీంబీ, అరుణ, సుధ, రామాంజినమ్మలతో అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆరాతీశారు. వివిధ రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు టైం లైన్ ప్రకారం స్టాక్ చేరుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కార్యకర్తలు 9 గంటలకే కేంద్రంలో ఉండాలన్నారు. అంగన్‌వాడీ ద్వారా అందించే సేవలు మొబైల్ యాప్‌లో ఎప్పటికప్పుడు పొందుపరచాలన్నారు. ఈ విషయాలను సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తూ కార్యకర్తలకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. సమావేశంలో ప్రాజెక్టు కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హోటళ్ల తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రజలకు అందించే ఆహారంలో శుచి, శుభ్రత పాటించాలని లేనిచో హోటళ్లను సీజ్ చేస్తామని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. పట్టణంలోని పలు హోటళ్లను బుధవారం మున్సిపల్ కమిష నర్ దివాకర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్ సచివాలయ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. స్థానిక కణేకల్ రోడ్డు వద్ద ఉన్న లక్ష్మీ ఫ్యామిలీ రెస్టారెంట్, తృప్తి గ్రాండ్ హోటళ్లను తనిఖీ చేయగా నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, మాంసాన్ని గుర్తించి వాటిని పారవేశారు. ఇకపై ఇలాంటి ఆహారం వడ్డిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని యజమానులను హెచ్చరించారు. హోటళ్లలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నిలుపుదల చేయాలని, క్లాత్ కవర్స్, బయో డిగ్రేడబుల్ కవర్స్ మాత్రమే వాడాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్ లేని తృప్తి హోటల్‌కు రూ. 5వేలు, ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు ఉపయోగించిన లక్ష్మీ హోటల్‌కు రూ. 2,500 జరిమానా విధించారు. ఇకపై ప్రతి వారం పట్టణంలోని హోటళ్లను తనిఖీ చేస్తామని, చెడిపోయిన ఆహారం కానీ మాంసం కానీ పట్టుబడితే జరిమానాలు విధించడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని హోటల్‌ను సీజ్ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

## పశువైద్యశాల తనిఖీ

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలోని పశు వైద్యశాలను జిల్లా డిడి రమేష్ రెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించి ఎల్ఎస్ఏ రెస్మాను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి భవనం గురించి మాట్లాడుతూ వర్షం వస్తే పై స్లాబ్ నుంచి నీటి ఊటలు కిందకు పడుతున్నాయని చెప్పారు. వైద్యశాలలో ఖాళీ పోస్టుల భర్తీ, నూతన భవన నిర్మాణం అంశాలను ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు డిడి తెలిపారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న డి డి

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

## జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఈబి.దేవి



**ప్రజాశక్తి-అనంతపురం**

సీజనల్ వ్యాధులపై ప్రజలు, వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఈబి.దేవి సూచించారు. వర్షాకాలం కారణంగా వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, ముఖ్యంగా వైరల్ ఫీవర్స్‌తో పాటు అక్కడక్కడ డెంగీ వంటి వ్యాధులు వస్తున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ప్రజల సహకారంతోనే సీజనల్ వ్యాధులను అరికట్టవచ్చునని అందరూ అప్రమత్తంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డిఎంహెచ్ఒ ప్రజాశక్తితో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. గ్రామాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర పీడితుల రక్త పూతలు సేకరిస్తున్నారన్నారు. డెంగీ లక్షణాలు ఉన్న వారి సీరం సేకరించి అనంతపురం, గుంతకల్లు, తాడిపత్రిలో పరీక్షలు చేయించాలని, ఎలిశా పరీక్ష ద్వారా మాత్రమే డెంగీ నిర్ధారణ సాధ్యమన్నారు. ఒక్కసారిగా ఎక్కువ జ్వరం రావడం, తీవ్రమైన తలనొప్పి, కళ్ల వెనకాల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు, శరీరమంతా దద్దుర్లు, వాంతులు, వికారం, అలసట, బలహీనత డెంగీ లక్షణాలు అన్నారు. ఆయ లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు. జ్వరం కేసులు నమోదైన గ్రామాల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. గ్రామస్థాయిలో పంచాయతీ సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి, కుండలు, ట్యాంకులు, చుట్టుపక్కల వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. వేడి చేసి కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. ఈ సీజన్‌లో చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలన్నారు.

# రైతు సంఘం నాయకులపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి-తాడిపత్రి**

ఎపి రైతు సంఘం నాయకులపై గుంతకల్లు ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు ఆక్షేపణీయమని, వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఎపి రైతు సంఘం తాడిపత్రి మండల కమిటీ డిమాండ్ చేసింది. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం నాయకులు మాట్లాడుతూ గుత్తి, పామిడి మండలాల పరిధిలోని ఐదు గ్రామాల్లో రెన్యూ విక్రమ్ సంస్థ సోలార్, విండ్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తోందని, వీటికి లీజు పద్ధతిలో అధికార పార్టీ నేతల బెదిరింపులతో దళారుల చేత భూ సేకరణ సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా, మండల స్థాయి నాయకులు భూములను పరిశీలించేందుకు బేతాపల్లి గ్రామం వెళ్లగా ఎమ్మెల్యే అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడంతో పాటు బెదిరించారన్నారు. ఇటువంటి బెదిరింపులకు రైతు సంఘం భయపడదని, దీటుగా ఎదుర్కొంటుందని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి రాజారామ్‌రెడ్డి, అధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష, రైతు సంఘం మండల కమిటీ సభ్యురాలు ప్రమీలమ్మ పాల్గొన్నారు.

# ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల కొరతను తీర్చాలి

## నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న గౌని ప్రతాపరెడ్డి

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో 22 మంది డాక్టర్ల అవసరం ఉంటే ప్రస్తుతం 8 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, వారిలో కూడా ఇద్దరు డాక్టర్లు త్వరలోనే బదిలీ అయ్యే అవకాశం ఉందన్నారు. ఆసుపత్రిలో ఉన్న అతి తక్కువ మంది వైద్యులతో సాధ్యమైనంత ఎక్కువ మందికి వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ మెర్సీ జ్ఞాన సుధ చెప్పినట్లు తెలిపారు. ఆసుపత్రిలో ఆర్థోపెడిస్ట్, సివిల్ సర్జన్ స్పెషలిస్ట్, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, జనరల్ మెడిసిన్‌లో గైనకాలజీ లేరన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ వెంటనే స్పందించి రాయదుర్గం ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

## జిల్లా వృత్తి విద్యాధికారి వెంకట రమణ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ

**ప్రజాశక్తి-ఉరవకొండ**

విద్యార్థులు అంకితభావంతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని జిల్లా వృత్తి విద్యాధికారి వెంకటరమణ నాయక్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బుధవారం ఆయన సందర్శించి కాసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ అకడమిక్ విషయాలను దృష్టిలో ఉంచు కొని విద్యాబోధన సాగించాలన్నారు. త్వరలో ప్రభుత్వం నిర్వహిస్తున్న క్వార్టర్లీ పరీక్షలకు విద్యార్థులను బాగా సన్నద్ధం చేయాలన్నారు. ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తదితర పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలు సాధించేలా క్రమశిక్షణతో మెలగాలన్నారు. షైనింగ్ స్టార్స్ విద్యార్థుల స్ఫూర్తితో పోటీతత్వంతో చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్స్ కృష్ణమూర్తి, షాషావలి, బోధన సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను రెన్యువల్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఆర్‌డిటి పరిరక్షణ సమితి నాయకులు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్**

కేంద్రం వెంటనే ఆర్‌డిటికి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని ఆర్‌డిటి పరిరక్షణ సమితి ఎస్సీ, ఎస్టీ జెఎసి అధ్యక్షుడు సాకే హరి, బిసిఆర్ దాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు స్థానిక అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి నిరసన తెలిపారు. వారు మాట్లా డుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు విద్య, వైద్యం, వ్యవసాయం, క్రీడలు, తదితర అనేక రకాల సేవలందిస్తున్న ఆర్‌డిటికి కేంద్ర ప్రభుత్వం విదేశీ నిధులు రాకుండా ఆటంకం కలిగించడం దుర్మార్గ మన్నారు. ఆర్‌డిటి సంస్థకు వెంటనే ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని, లేనిచో గల్లీ నుండి ఢిల్లీ స్థాయి ఉద్యమానికి సంసిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో చెలిమప్ప, నారాయణ, కొల్హాపూరి, పెద్దన్న, అక్కులప్ప, కుల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధే టిడిపి లక్ష్యం

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

గ్రామాల అభివృద్ధే టిడిపి ధ్యేయమని మండల టిడిపి ఇన్‌ఛార్జి ధర్మవరపు బాలాజీ తెలిపారు. మండలంలోని తలుపూరు, వడ్డిపల్లి గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు నూతన లైన్ ఏర్పాటుకు బుధవారం భూమి పూజ చేశారు. బాలాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నేడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రతి పల్లెలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. వైసిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వారి సొంత గ్రామానికి కనీసం తారు రోడ్డు, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయిన అసమర్థుడు అన్నారు. కూటమి పాలనలో తోపుదుర్తి గ్రామానికి తారు రోడ్డు, విద్యుత్ స్టేషన్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బోయ శ్రీనివాసులు, సొసైటీ ఛైర్మన్ కృష్ణమోహన్‌చౌదరి, నాయకులు నాగేంద్ర, శ్రీనివాసరెడ్డి, మల్లారెడ్డి, సర్దానప్ప, నరసింహులు, రామాంజి, డీలర్ నరేష్ పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల వద్ద ధరల పట్టిక తప్పనిసరి

**ప్రజాశక్తి-నార్పల**

ఎరువుల దుకాణాల వద్ద తప్పనిసరిగా ఎరువులు, మందులు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ చెన్నవీరస్వామి ఆదేశించారు. పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఎంపి డిఒ సందర్శించి రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ కంపెనీల ఎరు వులు, మందులు, వాటి ధరలను తెలిపేలా ప్రతి దుకాణం ముందు పట్టిక ఏర్పాటు చేయాలని దుకాణ దారులకు సూచించారు. రికార్డుల్లోకి ఎక్కించకుండా అక్రమంగా ఎరువులను నిల్వ ఉంచరాదన్నారు.



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏవో చెన్నవీరస్వామి



సిఎం సహాయనిధి చెక్కులు అందజేసిన విప్ కాలవ

# సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

**రాయదుర్గం :** అనారోగ్య కారణాలతో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అత్యవసర శస్త్రచికిత్సలు చేయించుకొన్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను బుధవారం ఆయా కుటుంబాలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పట్టణంలోని తన నివాసంలో అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా 30 మందికి రూ. 16.83 లక్షల చెక్కులను కాలవ అందచేశారు.



డెంటల్ ఆసుపత్రి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

# డెంటల్ ఆసుపత్రి ప్రారంభం

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

స్థానిక బళ్లారి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన శ్లోక డెంటల్ ఆసుపత్రిని బుధవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రారంభించారు. పట్టణంలో ఆసుపత్రి ఏర్పాటు చేసిన డాక్టర్ సదానను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు దేశం శ్రీనివాసరెడ్డి, అశోక్, టిడిపి నాయకులు వెంకటేశులు, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లిపల్లి నారాయణ పాల్గొన్నారు.

# బిఎల్‌ఒలకు అవగాహన

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం బూత్ స్థాయి అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ బి.అనిల్ కుమార్ మాట్లాడుతూ బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి ఓటరు నమోదులో తప్పులు లేకుండా జాగ్రత్తగా పరిశీలించి ఓటురుగా నమోదు చేయాలన్నారు. ఫారం-6, 7, 8 క్లెయిమ్స్‌ను ఎలా చేయాలో సూచించారు. సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ మధుసూదన్‌రావు, ఆర్‌ఐ నగేష్‌బాబు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో రోగాలు దూరం

**శింగనమల :** పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వల్ల రోగాలు దరిచేరవని ఈవోఆర్‌డి విజయ్‌కుమార్ తెలిపారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని జూలాకాల్వ, సలకం చెరువు, నాయనవారిపల్లి గ్రామాల్లో బుధవారం జ్వరపీడితులకు చికిత్స చేశారు. అలాగే ఇంటింటి సర్వే నిర్వహించి కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియాపై అవగాహన కల్పించారు. నీటి తొట్టెలు, ప్లాస్టిక్ డ్రమ్ములు, డ్రెయినేజీ కాలువల్లో లార్వా నిర్మూలన కోసం అబేట్, ఆయిల్ బాల్స్ వేశారు. ఆరుగురు జ్వరంతో బాధ పడుతుండగా రక్త పూతలు సేకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది భారతి, విజయ్‌కుమార్, రమణయ్య, ఆంజనేయులు, హరిత, కౌసర్ బేగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫజిల్‌బాషా


# విధుల్లో అలసత్వం వద్దు

**తాడిపత్రి రూరల్ :** విధుల్లో అలసత్వం వహించకుండా బాధ్యతగా పని చేసి పలువురికి ఆదర్శంగా నిలవాలని ఎంపిడిఒ ఫజిల్‌బాషా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్స్‌తో సమీక్ష, సమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామాల వారీగా గుర్తించిన పనులు, జరుగుతున్న అభివృద్ధిపై ఆరా తీశారు. మండల వ్యాప్తంగా హౌసింగ్, హార్టికల్చర్, తదితర పనులపై ప్రోగ్రెస్ వివరాలు తెలుసుకున్నారు. కూలీల మస్టర్లను ఎప్పటికప్పుడు రోస్టర్‌లో నమోదు చేసుకుంటూ రికార్డు రూపంలో సంబంధిత కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ రాజ్యలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తా : 'కాపు'

**ప్రజాశక్తి-కణేకల్లు**

ఊపిరి ఉన్నంత వరకూ రాయదుర్గం నియోజకవర్గ ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తానని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. కాపు రామచంద్రారెడ్డిని బుధవారం స్థానిక ప్రకాశ్‌రెడ్డి ఇంటి వద్ద పార్టీలకు అతీతంగా పలువురు సన్మానించారు. కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నేను ఎక్కడ ఉన్నా రాయదుర్గం ప్రజలకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. వారికి ఏమైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకు రావాలని సూచించారు. తనకు రాజకీయాలు, పదవులు ముఖ్యం కాదని ప్రాణం ఉన్నంత వరకూ అభిమానించే వాళ్ల గుండెల్లో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, శేషారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హనుమంతరావు, మహబూబ్‌పీరా, నబీసా, సలీం, గౌస్, వన్నూర్‌సాబ్, జగదీష్, తిప్పేస్వామి, బాలు, తదితరులు పాల్గొన్నారు.



కాపు రామచంద్రారెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

# పత్తి దిగుమతి సుంకం తగ్గింపు సరికాదు




బుక్‌లెట్ విడుదల చేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

**ప్రజాశక్తి-పామిడి**

పత్తి దిగుమతిపై 11 శాతం దిగుమతి పన్ను రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను తక్షణమే వెనక్కు తీసుకోవాలని ఎపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎపి రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రామరాజుపల్లి, గజరాంపల్లి సచివాలయాల్లో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఎపి రైతు సంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం ఇచ్చిన జీవో వల్ల కంపెనీలకు లాభాలు వస్తాయే కానీ రైతులకు ఆత్మహత్యలు తప్పవన్నారు. ఆ జీవోకు వ్యతిరేకంగా గ్రామాలోల రైతులతో సమావేశాలు నిర్వహించి సుంకాల తగ్గింపు జీవో ఉపసంహరణ, క్వింటా పత్తికి రూ. 10,075 మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ తీర్మానం చేసి వాటిని ప్రధానికి పంపాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఈ నెల 8వ తేదీ జరిగే మహా సభల సందర్భంగా ఎదురూరు, రామరాజుపల్లె, గజరాంపల్లె, నీలూరు గ్రామాల్లో అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అలాగే స్థానిక సిపిఎం కార్యాలయంలో ఎపి రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో '2013 చట్టం'పై రూపొందించిన బుక్‌లెట్‌ను విడుదల చేశారు.

# శ్మశానవాటికలకు స్థలాలు కేటాయిస్తాం



మండల సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

**ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్**

గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు ప్రభుత్వమే ఎకరా చొప్పున భూమి కొనుగోలు చేసి కేటాయిస్తుందని తహశీల్దార్ నాగరాజు తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి విద్యా వతి అధ్యక్షతన ఎంపిడిఒ కొండన్న ఆధ్వ ర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లోనే కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేస్తామన్నారు. సవరణలు పూర్తయ్యాక పాత పుస్తకాల స్థానంలో కొత్త పట్టాదారు పుస్తకాలు ఇస్తాయన్నారు. సచివాల యాల వారీగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగు తుందన్నారు. జడ్పిటిసి మల్లికార్జున మాట్లాడుతూ ప్రస్తుతం మంజూరైన గ్రాంట్‌లో పార్టీలకు అతీతం గా ఎంపిటిసిలకు గౌరవ వేతనాలు చెల్లించాల న్నారు. మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత్‌రెడ్డి మాట్లాడుతూ శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. విద్యుత్ స్తంభం మార్చేం దుకు రూ.10వేలు అడుతున్నారని వైస్ ఎంపిపి శాంతిబాయి ఫిర్యాదు చేశారు. సమావేశంలో సర్పంచులు ఎర్రిస్వామిరెడ్డి, రాజశేఖర్, ఎంపిటిసి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరీష్, జెఈ మునిస్వామి, ఎపిఒ రవి, హౌసింగ్ ఏఈ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# సాకే జయరామ్‌కు నివాళి



విద్యార్థికి నగదు అందజేస్తున్న ప్రిన్సిపల్, తదితరులు

**ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్**

మాజీ ప్రిన్సిపల్, సీఈసీ లెక్చరర్ సాకే జయరామ్ ఆదర్శప్రాయుడని వక్తలు అభిప్రాయ పడ్డారు. సాకే జయరామ్ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్, డాక్టర్ దేశం శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జనార్ధన్, ఆనంద్‌రెడ్డి జయరామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ జయరామ్ ఇదే కళాశాలలో ఎన్నో ఏళ్లు సీఈసీ లెక్చరర్‌గా సేవలందించి ఎంతో మందిని ప్రయోజకులను చేశారన్నారు. అనంతరం 2024-25లో సీఈసీలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 5వేలు, రూ. 3వేలు, రూ.2వేలు అందజేరు. కార్యక్రమంలో భాస్కర్, శిష్యులు రోజిలీ, రాజేష్ పాల్గొన్నారు.

# ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు : ఏవో




పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారులు

**ప్రజాశక్తి-ఉరవకొండ**

ఎరువుల కొరత సృష్టిస్తే ఫర్టిలైజర్స్ షాపుల నిర్వాహకులపై చర్యలు తప్పవని విడపనకల్లు, ఉరవకొండ మండలాల వ్యవసాయ అధికారులు పెన్నయ్య, రామకృష్ణ హెచ్చరించారు. విడపనకల్లు మండలంలోని కరకముక్కల, హావలిగి, ఉరవకొండ మండలంలోని మోపిడి గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. కంది, వేరుశనగ, వరి, మిరప, తదితర పంటల్లో చీడపీడల నివారణ, ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ కాని రైతులు బ్యాంకు ఖాతాకు ఆధారు లింక్, ఎన్‌పిసిఐ లింక్ యాక్టివేషన్ చేసుకోవాలన్నారు. పెండింగ్ రైతుల జాబితా వివరాలు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో తెలుసుకోవచ్చన్నారు. వారి వెంట ఎఇఒ కైలాష్‌నాథ్, విహెచ్‌ఎ చిక్కన్న, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

**ప్రజాశక్తి-బెళుగుప్ప**

మండలంలోని కాలువపల్లి గ్రామ రైతు సేవా కేంద్రంలో బుధవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్ ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు, సస్యరక్షణ, చీడపీడల నివారణలపై అవగాహన కల్పించారు. కళ్యాణదుర్గం ఉద్యాన అధికారి కృష్ణతేజ 2025-26కు సంబంధించి ఉద్యాన పథకాలు, రాయతీల గురించి వివరించారు. అనంతరం ఉద్యాన పంటలను పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. జిల్లా ఉద్యాన అధికారి డి.ఉమాదేవి రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. అనంతరం అరటి, చీని తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వారి వెంట రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు ఉన్నారు.



పంటలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారులు

# సర్పంచులకు నిధుల విడుదలపై 'దేగల' హర్షం



**ప్రజాశక్తి-శింగనమల**


డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ పుట్టిన రోజు కానుకగా సిఎం చంద్రబాబు సర్పంచులకు రూ. 1,121 కోట్లు విడుదల చేయడం పట్ల బుధవారం టిడిపి జిల్లా అధికార ప్రతినిధి, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ కార్య నిర్వాహక కార్యదర్శి దేగల కృష్ణమూర్తి హర్షం వ్యక్తం చేశారు. కృష్ణమూర్తి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు వచ్చేందుకు పిఆర్ ఛాంబర్ అధ్యక్షులు యలమంచిలి బాబురాజేంద్ర ప్రసాద్ విశేష కృషి చేశారని కొనియాడారు. నిధులు విడుదల చేసినందుకు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ సభ్యుల తరపున దేగల కృతజ్ఞతలు తెలిపారు.

# 'పొగాకు' దుష్పరిణామాలపై అవగాహన

**ప్రజాశక్తి-అనంతపురం**

జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి ఆధ్వ ర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో 'పొగాకు రహిత ప్రాంతం ధ్రువీకరణ'పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం నగరంలోని శ్రీకృష్ణ దేవరాయ జడ్పీ హైస్కూల్‌లో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ బోయ శ్రీరాములు మాట్లాడుతూ విద్యా సంస్థ ప్రాం గణం, పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుంచి రక్షించుకోవాలన్నారు. అలాగే విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది కమలమ్మ, సుమిత్ర, ఆశా లక్ష్మీనరసమ్మ, జిల్లా పొగాకు నియంత్రణ సోషల్ వర్కర్ శ్రీరాములు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# యూరియా కొరత తీర్చాలి



మాట్లాడుతున్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి-పెద్దవడుగూరు**

మండలంలోని రైతులకు తగినంత యూరియా సరఫరా చేయాలని వైసిపి ఐటి విభాగం జిల్లా అధ్యక్షులు రాజశేఖరరెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని క్రిష్టిపాడు వద్ద 67వ జాతీయ రహదారిపై బుధవారం ఆయన వైసిపి యువ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులు సాగుచేసిన పంటలకు తగినంత యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం రైతులకు తగినంత యూరియా ఇవ్వాలని, పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించాలని, అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 20వేలు ఒకేసారి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బ్రహ్మారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, జ్ఞానేశ్వర్, హరీష్, సుబ్బు పాల్గొన్నారు.

# పెన్నహోబిలం ఇన్‌ఛార్జి ఈవోగా ఎన్.తిరుమలరెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న తిరుమలరెడ్డి

**ఉరవకొండ :** మండలంలోని పెన్నహోబిలంలో వెలసిన సుప్రసిద్ధ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ఇన్‌ఛార్జి ఈవోగా ఎన్.తిరుమలరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ రెగ్యులర్ ఈవో గా పని చేస్తున్న సాకే రమేష్‌బాబు వ్యక్తిగత కారణాలతో సెలవులో వెళ్లారు. దీంతో జిల్లా దేవా దాయ శాఖ అధికారి తిరుమలరెడ్డికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. తిరుమలరెడ్డి మాట్లా డుతూ ఆలయ సిబ్బందిని సమన్వయం చేసుకుం టూ భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.

# జాబ్‌మేళాలో 52 మందికి ఉద్యోగాలు

**రాయదుర్గం :** పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్ ఆఫ్ సంస్థ ఛైర్‌పర్సన్ దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో మొత్తం 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్‌మేళాకు 142 మంది అభ్యర్థులు హాజరు కాగా 52 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.షేక్‌అలీషాఖలం, ఎపి నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పివి.ప్రతాపరెడ్డి, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సి.మహేష్, ఎపి ఎస్‌ఎస్‌డిసి కోఆర్డినేటర్ రాము, కంపెనీల ప్రతినిధులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# శాశ్వత ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

**పామిడి :** మండలంలోని వంకరాజు కాల్వ, రామ రాజుపల్లి, రామగిరి గ్రామాల సచివాలయాలు, పామిడి లోని మదీనా ఏరియా-1, ఎద్దులపల్లి రోడ్డు సచివాలయాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ తేజోష్ణ తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండల ప్రజలు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఎంపిడిఒ కార్యాలయం తనిఖీ

**పుట్లూరు :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని బుధవారం సిఇఒ శివశంకర్ తనిఖీ చేశారు. మండల కేంద్రంలో ఎంత నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులు ఏఏ పనులకు వాడుకున్నారు, తదితర రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపిడిఒ అలివేలమ్మ, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

# మూడు రోజుల్లో యూరియా : ఏవో

**శింగనమల :** మూడు రోజుల్లో యూరియా వస్తుంది.. రైతులెవరూ ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్ తెలిపారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ, పత్తి, వరి, జొన్న, తదితర పంటలకు యూరియా అవసరమని, మరో రెండు మూడు రోజుల్లో మండలానికి యూరియా వస్తుందని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.

# వైద్య సిబ్బందికి ముందస్తు టీకాలు

**పామిడి :** మండలంలోని ఎద్దులపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ నేతృత్వంలో బుధవారం ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు, వైద్య సిబ్బందికి ముందస్తు టీకాలు వేశారు. టిబి వ్యాధి రాక ముందే శరీరంలో వ్యాధి కారకమైన బాక్టీరియాను పసిగట్టి, మనిషి టిబి రోగిగా మారక ముందే మందులతో నయం చేసే సై-టిబి టీకా వేశారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ టిబి(క్షయ) లక్షణాలు, నివారణ మందులు, జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ తులశమ్మ, సూపర్వైజర్ రామిరెడ్డి, సునీర్‌బాషా, సుధాకర్, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మారెమ్మ జాతర

**బ్రహ్మసముద్రం :** మండలంలోని ముప్పులకుంట గ్రామంలో బుధవారం ప్రజలు మారెమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సర్పంచి చాపిరి కొల్హాపురమ్మ, వెంకటేశులు, జనార్ధన ఆహ్వానం మేరకు ఎంపి అంబికా లక్ష్మీనారాయణ జాతరలో పాల్గొన్నారు. ఆయన ముందుగా గ్రామ దేవతను దర్శించు కుని సర్పంచి ఇంటి వద్ద ఏర్పాటు చేసిన విందు భోజనంలో పాల్గొన్నారు. కాసేపు టిడిపి కార్యకర్తలతో ముచ్చటించారు. ఆయన వెంట డీఎస్పీ రవిబాబు, సిఐ నీలకంఠ, నాయకులు శివప్రసాద్, నరసింహు లు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఈశ్వర్, గొల్ల వెంకటేష్, వెంకటేశులు, పత్తిపాటి వెంకటేశులు, దండు సత్యనారాయణ, సర్పంచి సందీప్, నారా ప్రహ్లాద, చిత్తప్ప, నల్లప్ప, హనుమంతరాయుడు ఉన్నారు.

# చికిత్స పొందుతూ రైతు మృతి

**పెద్దవడుగూరు :** తన వ్యవసాయ పొలంలో పంటకు పురుగుల మందు పిచికారి చేస్తూ అస్వస్థతకు గురైన రైతు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన రైతు చిన్నపెద్దప్ప (50) తన వ్యవసాయ పొలంలో పత్తి పంట సాగు చేశాడు. చీడపీడల నివారణకు గత ఆదివారం పురు గుల మందు పిచికారి చేస్తూ అస్వస్థతకు గుర య్యాడు. దీంతో కుటుంబ సభ్యులు వెంటనే అనంత పురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. అతడికి భార్య, ఓ కుమార్తె ఉన్నారు. అతడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# పేకాట జూదరులు అరెస్ట్

**పుట్లూరు :** మండలంలోని గాండ్లపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు చేసి గాండ్లపాడు గ్రామ శివారులోని ముళ్లపొదల మాటున పేకాట ఆడుతుండగా ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ. 14,500 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.